
సాక్షి
తూర్పుగోదావరి
శనివారం | 21 | డిసెంబర్ | 2024



అన్నదాతలకు 'యంత్ర'లాభం
ట్రాక్టర్‌కు స్ట్రాబేలర్ యంత్రాన్ని అమర్చి, గడ్డిని సేకరించడం ఇటు రైతులకు, అటు కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంటోంది.
8లో



ఆలయ పునర్నిర్మాణానికి రూ.లక్ష
సఖినేటిపల్లి: గొంది గ్రామంలోని ఆదివీర్లమ్మ, కనకదుర్గమ్మ, మావుళ్లమ్మ, పుంతలో ముసలమ్మ అమ్మవార్ల ఆలయ పునర్నిర్మాణానికి నల్లా విజయలక్ష్మి చారిటబుల్ ట్రస్ట్ (ఉండి) రూ.లక్ష విరాళం అందజేసింది.

డెల్టాలకు 9,375 క్యూసెక్కులు

ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శుక్రవారం 9,375 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. తూర్పు డెల్టాకు 2,875, మధ్య డెల్టాకు 1,500, పశ్చిమ డెల్టాకు 5 వేల క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.90 అడుగులకు చేరింది.

న్యూస్‌రీల్

టెన్త్‌లో నూరు శాతం ఉత్తీర్ణత రావాలి : కలెక్టర్ ప్రశాంతి

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): పదో తరగతి పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నూరు శాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే కార్యాచరణతో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. విద్యా శాఖ ప్రగతి లక్ష్యాలపై సంబంధిత శాఖల జిల్లా, డివిజన్, మండలం స్థాయి అధికారులతో శుక్రవారం ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, బోధన విషయంలో నిర్లక్ష్యం వహించే ఉపాధ్యాయులు, అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి 15 రోజులకోసారి విద్యా ప్రగతిపై సమీక్షలు నిర్వహిస్తామని, లక్ష్య సాధనలో వెనుకబడినవారిపై చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. గత ఆగస్టు నుంచి ఇప్పటి వరకూ వివిధ అంశాలపై ప్రగతి నివేదికలు సమర్పించాలన్నారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ఆయా ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె.వాసుదేవరావు మాట్లాడుతూ, పదో తరగతిలో నూరు శాతం ఫలితాలు సాధించే దిశగా 100 రోజులు అదనపు తరగతులు నిర్వహించి, విద్యార్థులకు సబ్జెక్టుల వారీగా బోధన చేస్తున్నామని చెప్పారు. దీనికి అనుగుణంగా ఇప్పటికే ఉపాధ్యాయులకు లక్ష్యాలు ఇచ్చామని, విద్యార్థులను మ్యాపింగ్ చేశామని తెలిపారు.

స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా రామకృష్ణ

కంబాలచెరువు (రాజమహేంద్రవరం): జిల్లా స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీగా బి.రామకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఎస్పీ డి.నరసింహ కిశోర్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. 1991 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ గతంలో కోనసీమ జిల్లా రామచంద్రపురం ఎస్‌డీపీవోగా పనిచేశారు.

బాధ్యతలు స్వీకరిస్తున్న రామకృష్ణ

ప్రజల మనిషి సుందరయ్య

సీపీఎం జిల్లా మహాసభల ప్రారంభోత్సవ సభలో వక్తలు

పెద్దాపురం: కమ్యూనిస్టు దిగ్గజం పుచ్చలపల్లి సుందరయ్య ప్రజల మనిషి అని పలువురు వక్తలు కొనియాడారు. సీపీఎం జిల్లా మహాసభల సందర్భంగా స్థానిక వరహాలయ్యపేటలోని యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం సుందరయ్య జీవిత విశేషాలతో ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. దీనిని సీపీఎం సీనియర్ నాయకుడు టీఎస్ ప్రకాష్ ప్రారంభించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన, సీపీఎం జిల్లా కమిటీ సభ్యురాలు బేబీరాణి మాట్లాడుతూ, నిత్యం ప్రజల కోసమే ఆలోచించిన వ్యక్తి సుందరయ్య అని అన్నారు. ఉద్యమమే ఊపిరిగా నిస్వార్థ నాయకుడిగా ఎదిగిన ఆయన ఆశయాలను, ఆలోచనలను ముందుకు తీసుకుని వెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని చెప్పారు. పార్లమెంట్‌కు సైకిల్‌పై వెళ్లి, కమ్యూనిస్టు గాంధీగా పేరొందారని, కమ్యూనిస్టులు ఎంత నిస్వార్థంగా పని చేస్తారో చెప్పడానికి సుందరయ్య జీవితమే ఉదాహరణని అన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు కరణం ప్రసాదరావు, నాయకులు నీలపాల సూరిబాబు, గడిగట్ల సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.



నాడు.. టిప్‌ట్యాబ్‌గా..

- విద్యా రంగంలో నూతన సంస్కరణలకు గత సీఎం జగన్ నాంది
- కొత్త పుంతలు తొక్కిన ప్రభుత్వ విద్యా వ్యవస్థ
- విద్యార్థులకు వేలాదిగా ట్యాబ్‌ల అందజేత
- ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీల ద్వారా బోధన
- నాడు–నేడుతో బడులకు కొత్త రూపు
- అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెనలతో పేదల చదువులకు ప్రోత్సాహం
- నేడు ఆ విద్యా ప్రదాత జన్మదినం

'పిల్లలకు మనం ఇచ్చే గొప్ప ఆస్తి ఏదైనా ఉందీ అంటే అది చదువే' అని గత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి త్రికరణ శుద్ధిగా నమ్మారు. ఎక్కడ ఏ సభ జరిగినా, సమావేశం జరిగినా.. ఈ విషయాన్ని పదేపదే చెప్పేవారు. పేదింటి పిల్లలు అంతర్జాతీయ స్థాయిలో సత్తా చాటాలని పరితపించేవారు. ఆ తపనతోనే తన హయాంలో ప్రభుత్వ విద్యారంగంలో సరికొత్త మార్పులు తీసుకుని వచ్చారు. అప్పటి వరకూ ప్రభుత్వ బడులంటే ఉన్న చిన్నచూపును పోగొట్టారు. 'నాడు – నేడు'తో పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చేశారు. చదువులను డిజిటల్ బాట పట్టించి.. స్మార్ట్‌గా మార్చారు. అమ్మ ఒడి, విద్యా, వసతి దీవెనలతో పేద పిల్లల ఉన్నత చదువులకు తోడ్పాటునందించారు. గోరుముద్దతో రుచికరమైన పౌష్టికాహారం అందించారు. విద్యా కానుక ద్వారా సకాలంలో నోట్, పాఠ్య పుస్తకాలు అందజేశారు. కళాశాలల ఆధునీకరణకు సైతం నాంది పలికారు. ప్లస్–2తో ఉన్న ఊళ్లోనే ఇంటర్ విద్య చదువుకునే అవకాశం కల్పించారు. ఒక్క మాటలో చెప్పాలంటే అడ్మిషన్ల సమయంలో హౌస్‌ఫుల్ బోర్డులు పెట్టే స్థాయికి ప్రభుత్వ బడులను తీసుకుని వెళ్లారు. వెరసి విద్యాప్రదాతగా ఖ్యాతి గడించారు.

నేడు మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుట్టిన రోజు. ఈ సందర్భంగా ఆయన హయాంలో ప్రభుత్వ విద్యా రంగంలో వచ్చిన వినూత్న మార్పులపై సింహావలోకనం...

– సాక్షి, రాజమహేంద్రవరం

వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో విద్యారంగానికి చేకూర్చిన లబ్ధి

పథకం	లబ్ధిదారులు	లబ్ధి (రూ.కోట్లలో)
విద్యాదీవెన	70,241	142.99
వసతి దీవెన	69,098	65.56
అమ్మ ఒడి	1,56,000	234
జగనన్న విదేశీ విద్య	12	1.37
జగనన్న గోరుముద్ద	84,488	12.32
జగనన్న విద్యాకానుక	1,22,000	28.8
నాడు–నేడు పనులు	1,069	369.89



రాజమహేంద్రవరం రూరల్ మండలం శాటిలైట్ సిటీ కళాశాల, పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా తీర్చిదిద్దిన తరగతి గది



నాడు–నేడుతో రాజమహేంద్రవరం రూరల్‌లో అధునాతనంగా రూపుదిద్దుకున్న శాటిలైట్ సిటీ పాఠశాల, కళాశాల

విద్యా కానుక



జగనన్న విద్యాకానుక ద్వారా ఏటా స్కూల్ బ్యాగ్, యూనిఫాం, బెల్ట్, పాఠ్య, నోట్ పుస్తకాలు, వర్క్ బుక్స్, డిక్షనరీ వంటి వాటితో ప్రత్యేక కిట్ అందజేసేవారు. ఈవిధంగా జగన్ హయాంలో జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లోని 1.765 లక్షల మంది విద్యార్థులకు రూ.30.50 కోట్ల విలువైన వస్తువులు అందించారు.

కళాశాలల ఆధునీకరణ

అంతకుముందు కొన్నేళ్లుగా నిరాదరణకు గురైన ప్రభుత్వ జూనియర్ కళాశాలల అభివృద్ధికి గత జగన్ ప్రభుత్వం నాంది పలికింది. జిల్లావ్యాప్తంగా 15 కళాశాలలను రూ.10.79 కోట్లతో ఆధునీకరించారు.

'అమ్మ ఒడి'తో భరోసా



'జగనన్న అమ్మ ఒడి' పథకం ద్వారా పేద విద్యార్థుల చదువులకు నాటి జగన్ సర్కార్ ఆర్థిక తోడ్పాటు అందించింది. పిల్లల చదువుల కోసం విద్యార్థుల తల్లులకు రూ.15 వేల ఆర్థిక సాయం అందజేసేవారు. ఈ విధంగా ఏటా జిల్లా వ్యాప్తంగా 1,55,769 మంది విద్యార్థులకు రూ.233.65 కోట్లు అందజేశారు. తద్వారా వారు ఎటువంటి ఆర్థిక ఇబ్బందులూ లేకుండా చదువుకునేవారు.

వసతి దీవెన



జగనన్న వసతి దీవెన పథకం కింద జిల్లావ్యాప్తంగా 34,261 మంది విద్యార్థులకు చెందిన 30,559 మంది తల్లుల ఖాతాల్లో జగన్ సర్కార్ ఏటా రూ.32.61 కోట్లు జమ చేసేది.

బడుల రూపురేఖల మార్పు

'మన బడి నాడు – నేడు' పథకం ద్వారా ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్‌కు దీటుగా అభివృద్ధి చేశారు. తొలి విడతతో 414 పాఠశాలల్లో 1,006 పనులకు రూ.129.70 కోట్లు ఖర్చు చేశారు. రెండో దశలో రూ.271 కోట్లు వెచ్చించి 665 పాఠశాలల్లో 996 అభివృద్ధి పనులు చేపట్టారు.

ప్రభుత్వ విద్యకు నేడు 'చంద్ర'గ్రహణం

గత సార్వత్రిక ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ విద్యా రంగానికి 'చంద్ర'గ్రహణం పట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు సకాలంలో పుస్తకాలే ఇవ్వలేకపోయింది. అవి కూడా చాలీచాలనట్టుగానే ఇచ్చారు. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అప్పటికే సిద్ధం చేసిన విద్యాకానుక కిట్లను పంపిణీ చేయడంలో సైతం కూటమి ప్రభుత్వం ఆపసోపాలు పడిందంటే పరిస్థితి ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇక విద్యార్థులకు ట్యాబ్‌ల ఊసే లేదు. ఈ పరిస్థితిపై వారి తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు.

విద్యా దీవెన



జగనన్న విద్యా దీవెన పథకంలో భాగంగా జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, కాపు వర్గాలకు చెందిన 34,764 మంది పేద విద్యార్థులకు ఏటా రూ.32.74 కోట్లు అందజేశారు.

రుచికరంగా గోరుముద్ద



జగనన్న గోరుముద్ద పథకం కింద విద్యార్థులకు రోజుకో మెనూతో నాణ్యమైన, రుచికరమైన, బలవర్థకమైన మధ్యాహ్న భోజనం పెట్టేవారు. ఈ పథకం ద్వారా జిల్లా వ్యాప్తంగా 1,011 పాఠశాలల్లోని 1.26 లక్షల మంది విద్యార్థులు లబ్ధి పొందేవారు.

బైజూస్ కంటెంట్‌తో ట్యాబ్‌లు



చాగల్లు పాఠశాలలో ట్యాబ్‌లతో విద్యార్థులు (ఫైల్)

గత సీఎం జగన్ తన పుట్టిన రోజు సందర్భంగా ఏటా డిసెంబర్ 21న క్రమం తప్పకుండా బైజూస్ కంటెంట్‌తో కూడిన ట్యాబ్‌లను ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు అందజేసేవారు. 2022–23 విద్యా సంవత్సరంలో 15,291 మంది విద్యార్థులకు, 2,445 మంది ఉపాధ్యాయులకు వీటిని అందించారు. 2023–24లో 15,332 మంది 8వ తరగతి విద్యార్థులకు 5,510 ట్యాబ్‌లు అందజేశారు. కొత్తగా చేరిన 181 మంది 9వ తరగతి విద్యార్థులకు సైతం వీటిని ఇచ్చారు. ఈ ట్యాబ్‌లలో ఈ–పాఠశాల యాప్ ద్వారా 3వ తరగతి నుంచి ఇంటర్ వరకూ పాఠాలను అప్‌లోడ్ చేశారు. విద్యార్థులు తమ సందేహాలను దృశ్యరూపంలో తీర్చుకునేలా, పాఠ్యాంశాలను మరింత సులభంగా అర్థం చేసుకునేలా ఈ ట్యాబ్‌లు ఎంతో ఉపయోగపడేవి. తమ పిల్లలు టిప్‌టాప్‌గా మంచి యూనిఫాం, చేతిలో ట్యాబ్‌తో పాఠశాలకు వెళ్తుంటే చూసి తల్లిదండ్రులు మురిసిపోయేవారు.

జగనన్న గోరుముద్ద పథకానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.11.64 కోట్లు వెచ్చించింది.

ప్రైవేటులోనూ రిజర్వేషన్

పేద విద్యార్థులకు ప్రైవేటు విద్యలో సైతం రిజర్వేషన్లను గత ప్రభుత్వం అమలు చేసింది. ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లల్లో 25 శాతం సీట్లు పేదలకు ఇవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. అందులో 10 శాతం ఎస్సీలకు, 5 శాతం దివ్యాంగులకు కేటాయించింది. మరో 4 శాతం ఎస్టీలకు, బలహీన వర్గాలకు 6 శాతం సీట్లు ఇవ్వాలని ఆదేశించింది.

ప్లస్–2తో ప్రయోజనం

పదో తరగతి అనంతరం ఇంటర్ చదివేందుకు దూర ప్రాంతాలకు వెళ్లలేక గ్రామీణ విద్యార్థులు అనేక అవస్థలు పడేవారు. వారికి ఆ ఇబ్బందులను దూరం చేసే లక్ష్యంతో వారు ఉన్న ఊరికి సమీపంలోనే ఇంటర్ విద్యను అందించే బృహత్తర కార్యక్రమానికి నాటి జగన్ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగానే ప్రతి మండలంలోను ఒకటి చొప్పున ప్లస్–2 బాలికల జూనియర్ కాలేజీలు 15 ఏర్పాటు చేసింది.

బోధనలో స్మార్ట్

జిల్లాలోని 297 పాఠశాలల్లో డిజిటల్ విద్యా బోధనను జగన్ అమలు చేశారు. దీనికిగాను 1,099 స్మార్ట్ టీవీలు, 386 ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్స్ (ఐఎఫ్‌పీ) అమర్చారు. వీటి సహాయంతో బోధించడం ద్వారా విద్యార్థులు మరింత సులభంగా పాఠ్యాంశాలు అర్థం చేసుకునే అవకాశం కలిగింది.



శాటిలైట్ సిటీ కళాశాలలో స్మార్ట్ విద్యాబోధన

నేటి నుంచి హెల్మెట్ తప్పనిసరి

కాకినాడ క్రైం: జిల్లా పరిధిలో ద్విచక్ర వాహనాలపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ శనివారం నుంచి తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ శుక్రవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. రోడ్డు ప్రమాదాల వల్ల చోటు చేసుకుంటున్న అధిక మరణాలకు హెల్మెట్ ధరించకపోవడమే కారణమని, ఈ నేపథ్యంలో రాష్ట్ర హైకోర్టు ఆదేశాల మేరకు ప్రభుత్వ సూచనలతో తాజా ఆదేశాలు జారీ చేశామని వివరించారు. హెల్మెట్ ధరించకుండా నిబంధనలు అతిక్రమించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు జరిమానాలు విధిస్తామని ఎస్పీ తెలిపారు.

టీడీపీలో భగ్గుమన్న విభేదాలు

- రాజీవ్‌కృష్ణ రాకను విభేదిస్తున్న తమ్ముళ్లు
- రసాభాసగా పార్టీ కొవ్వూరు నియోజకవర్గ సమావేశం
- మళ్లీ తెరపైకి గ్రూపు రాజకీయాలు
- రాజీవ్‌కృష్ణ ఫ్లెక్సీ బ్యానర్లపై జవహర్ ఫొటో వేయడంపై దుమారం
- ద్విసభ్య కమిటీ సభ్యుల ఫొటోలు లేకపోవడంపై కార్యకర్తల మండిపాటు



ఎమ్మెల్యే ముప్పిడి ఎదుట టీడీపీ నాయకులు, కార్యకర్తల వాగ్వాదం

కొవ్వూరు: టీడీపీలో నివురుగప్పిన నిప్పులా ఉన్న విభేదాలు మరోసారి భగ్గుమన్నాయి. కొవ్వూరులో శుక్రవారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి పార్టీ సమావేశం దీనికి వేదిక అయ్యింది. మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ ఇటీవల వైఎస్సార్ సీపీ నుంచి టీడీపీలో చేరిన విషయం తెలిసిందే. దీనిపై తెలుగు తమ్ముళ్లు భగ్గుమన్నారు. గడచిన ఐదేళ్లు టీడీపీ నాయకులను కేసులతో వేధించారంటూ ఆయనను, ఆయన అనుచరులను పార్టీలో చేర్చుకోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది. రాజీవ్‌కృష్ణ చేరికపై స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావును, టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యులను పలువురు నాయకులు, కార్యకర్తలు నిలదీశారు. అధికారంలో వచ్చిన తర్వాత ప్రత్యర్థులను పార్టీలో చేర్చుకుని తమపై పెత్తనం చేస్తారా? అని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజీవ్‌కృష్ణ వంటి వారిని చేర్చుకోవడం ద్వారా పార్టీలో కొత్త సమస్యలు వస్తాయన్నారు. ఇప్పటికే కలిసికట్టుగా ఉన్న పార్టీలో మరోసారి విభేదాలు తలెత్తక ముందే అధిష్టానం సరైన నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాజీవ్‌కృష్ణ ఇటీవల ఏటిగట్టుపై భారీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. దీనిలో మాజీ మంత్రి, టీడీపీ జిల్లా అధ్యక్షుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ ఫొటో వేసి, ద్విసభ్య కమిటీ సభ్యులు కంఠమని రామకృష్ణ, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి ఫొటోలు వేయకపోవడంపై తమ్ముళ్లు మండిపడ్డారు. అరుపులు, కేకలతో సమావేశం ఆద్యంతం గందరగోళంగా మారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకటేశ్వరరావు కలగజేసుకుని పార్టీ కార్యకర్తల ఆవేదనను ముఖ్య నాయకులైన అచ్చిబాబు దృష్టికి, అధిష్టానం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.

రాజీవ్‌కృష్ణ చేరికతో..

టీడీపీలో రాజీవ్‌కృష్ణ చేరిక ఆ పార్టీకి కొత్త చిక్కులు తెచ్చిపెట్టినట్టయ్యింది. రాజీవ్ కృష్ణ రాకను ఆయన మామ కృష్ణబాబుకు స్వయానా సోదరుడైన అచ్చిబాబు విభేదిస్తున్నట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే రాజీవ్‌కృష్ణ చేరిక సమయంలో స్థానిక ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, నియోజకవర్గ టీడీపీకి పెద్ద దిక్కుగా చెప్పుకునే పెండ్యాల అచ్యుతరామయ్య (అచ్చిబాబు) దూరంగా ఉన్నట్టు చెబుతున్నారు. ఇప్పటికే నియోజకవర్గ టీడీపీ మూడు గ్రూపులతో సతమతమవుతోంది. ఇప్పుడు రాజీవ్‌కృష్ణ చేరికతో మరో గ్రూపు పురుడు పోసుకున్నట్లయ్యింది. ఇటీవల అచ్చిబాబుకు, రాజీవ్‌కృష్ణకు మధ్య సఖ్యత లేదని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. రాజీవ్‌కృష్ణ చేరికను అడ్డుకునేందుకు అచ్చిబాబు వర్గీయులు చివరి వరకూ ప్రయత్నాలు చేశారు. దీంతో నందమూరి బాలకృష్ణ చిన్నల్లుడు, ఎంపీ భరత్ ద్వారా అధిష్టానం వద్ద రాజీవ్‌కృష్ణ పావులు కదిపారు. భరత్ ద్వారా లోకేష్‌ను ఒప్పించుకుని టీడీపీ తీర్థం పుచ్చుకున్నారని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇన్నాళ్లు నియోజకవర్గ టీడీపీలో అచ్చిబాబు చక్రం తిప్పారు. ఇప్పుడు రాజీవ్‌కృష్ణ చేరికతో ఇద్దరి మధ్య ఆధిపత్య పోరు మొదలయ్యే సూచనలు కనిపిస్తున్నాయి.

జవహర్ వర్గం మద్దతుతో పీఠలాటకం

ఇప్పటికే కొవ్వూరు టీడీపీలో మాజీ మంత్రి జవహర్‌కు, అచ్చిబాబుకు మధ్య వైరం నడుస్తోంది. గతంలో అచ్చిబాబుపై జవహర్ బహిరంగ విమర్శలు చేశారు. ఈ నేపథ్యంలో గత రెండు ఎన్నికల్లో జవహర్‌కు కొవ్వూరు టికెట్టు దక్కకుండా అచ్చిబాబు అడ్డుకున్నారు. ఇప్పుడు మామా అల్లుళ్ల మధ్య సఖ్యత లేకపోవడంతో జవహర్ వర్గీయులు రాజీవ్‌కృష్ణకు బాసటగా నిలిచారు. నియోజకవర్గంలో పార్టీని నడిపిస్తున్న ద్విసభ్య కమిటీ సభ్యులు సైతం రాజీవ్‌కృష్ణ చేరికకు అప్పట్లో హాజరు కాకపోవడం సర్వత్రా చర్చనీయాంశమైంది. అదే సమయంలో రాజీవ్‌కృష్ణ చేరికకు జవహర్ తనయుడు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు, పార్టీ రాజానగరం నియోజకవర్గ పరిశీలకుడు ఆశిష్‌లాల్ హాజరు కావడంపై అప్పట్లో పెద్ద దుమారం రేగింది. టీడీపీలో చేరిన అనంతరం కొవ్వూరు వచ్చిన రాజీవ్‌కృష్ణను జవహర్ వర్గీయులందరూ కలిసి పుష్పగుచ్ఛాలు అందించి, మద్దతు తెలిపారు. ఈ పరిణామం ఎమ్మెల్యే, అచ్చిబాబు వర్గీయులకు మింగుడుపడలేదు. ఎమ్మెల్యే ముప్పిడికి కొవ్వూరు టికెట్టు ఖరారు చేసిన సమయంలోనూ, ఎన్నికల్లోను జవహర్ సహకరించలేదు. బహిరంగంగానే ఆయనపై విమర్శలు సంధించారు. దీంతో వీరిద్దరి మధ్య విభేదాలు ఏర్పడ్డాయి. మొత్తం మీద జవహర్ వర్గం రాజీవ్‌కృష్ణ చెంతకు చేరడం రాజకీయ దుమారానికి కారణమైంది. ఈ పరిణామాలు రానున్న రోజుల్లో మామా అల్లుళ్ల సవాల్‌కు దారి తీసే అవకాశం ఉందని పరిశీలకులు భావిస్తున్నారు.

ఘనంగా సత్యదేవుని జన్మనక్షత్ర పూజలు



వనదుర్గ అమ్మవారికి చండీహోమం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం: రత్నగిరిపై సత్యదేవుని జన్మనక్షత్ర పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సత్యదేవుని జన్మనక్షత్రం మఖను పురస్కరించుకుని, స్వామివారికి, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, ఆయుష్య హోమం నిర్వహించారు. తెల్లవారుజామున 2 గంటలకు స్వామివారి ఆలయం తెరచి, స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సత్యదేవుడు, అమ్మవార్ల మూలవిరాట్‌లకు, శివలింగానికి పండితులు పంచామృతాలతో మహన్యాసపూర్వక అభిషేకం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లను స్వర్ణాభరణాలతో అలంకరించి, సుగంధభరిత పుష్పాలతో పూజించారు. ఉదయం 6 గంటల నుంచి భక్తులను స్వామివారి దర్శనానికి అనుమతించారు. దేవస్థానం ఈఓ వి.సుబ్బారావు ఈ కార్యక్రమంలో పాల్గొని, స్వామివారిని దర్శించారు. స్వామివారి యాగశాలలో ఉదయం 9 గంటల నుంచి సత్యదేవుడు, అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవార్లకు ఆయుష్య హోమం శాస్త్రోక్తంగా నిర్వహించారు.

సత్యదేవుని దర్శించిన 25 వేల మంది

సత్యదేవుని సుమారు 25 వేల మంది భక్తులు దర్శించారు. స్వామివారిని దర్శనానంతరం, భక్తులు గోశాలలో సప్తగోవులను దర్శించి, పూజలు చేశారు. అనంతరం రావిచెట్టు వద్ద జ్యోతులు వెలిగించి, ప్రదక్షిణ చేశారు. సత్యదేవుని వ్రతాలు వెయ్యి జరిగాయి. అన్ని విభాగాల ద్వారా దేవస్థానానికి రూ.20 లక్షల ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. సత్యదేవుని నిత్యాన్నదాన పథకంలో 4 వేల మందికి భోజనం పెట్టారు.

వనదుర్గ అమ్మవారికి చండీహోమం

రత్నగిరి వనదేవత వనదుర్గ అమ్మవారికి పండితులు చండీహోమం నిర్వహించారు. ఉదయం 9 గంటలకు అర్చకులు, పురోహితులు హోమం ప్రారంభించి 11 గంటలకు పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం అమ్మవారికి నీరాజనమంత్రపుష్పాలు సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. సత్యదేవుని దేవేరి అనంతలక్ష్మీ సత్యవతీదేవి అమ్మవారికి, తొలి పావంచా వద్ద కొలువైన కనకదుర్గ అమ్మవారికి కుంకుమ పూజలు కూడా నిర్వహించారు.

జ్యూయలరీ షాపులో చోరీకి విఫలయత్నం


స్థానికులకు పట్టు పడిన రాజు,


స్థానికులకు పట్టుపడిన అఖిల్

అన్నవరం: స్థానిక రైల్వేస్టేషన్ రోడ్డులోని జీవన జ్యూయలరీ షాపులో చోరీకి శుక్రవారం ఇద్దరు దుండగులు విఫల యత్నం చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ...సాయంత్రం నాలుగు గంటలకు జీవన జ్యూయలరీ షాపులోకి హెల్మెట్ ధరించిన ఇద్దరు వచ్చారు. ఆ సమయంలో షాపులో యజమాని బంధువు మంగరాజు ఉన్నాడు. అతను కస్టమర్‌లు వచ్చారని యజమాని వరదా లక్ష్మణరావును పిలిచాడు. ఆ షాపు మేడపై ఉంటున్న యజమాని కిందకు దిగి వచ్చి వారిని హెల్మెట్ తీయమని అడిగాడు. దాంతో వారిలో ఒకడు సుత్తితో అతనిపై దాడి చేయగా మంగరాజు అడ్డుగా రావడంతో అతనిపై కూడా దాడి చేశాడు. దీంతో వారు గట్టిగా కేకలు వేయగా మేడ మీద నుంచి యజమాని భార్య రాజేశ్వరి కిందకు రాగా ఆమెపై కూడా దాడి చేశారు. అదే సమయంలో దుండగుల్లో ఒకరు ఆ షాపులోని బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు మూట కట్టాడు. అయితే ఆ జ్యూయలరీ షాపులో నుంచి అరుపులు వినిపిస్తుండడంతో స్థానికులు ఆ షాపు అద్దాల నుంచి లోపలకు చూడగా లోపల ఆ దుండగులు దాడి చేస్తున్న విషయం కనిపించింది. ఆ దుండగులు ఇద్దరు ఆ షాపులోనుంచి వెలుపలకు వచ్చి పారిపోయే ప్రయత్నం చేయగా స్థానికులు వారిని పట్టుకున్నారు. ఆ దుండగులు ఇద్దరు తొండంగి మండలం ఏ కొత్తపల్లి గ్రామానికి చెందినవారని, వారిలో ఒకరు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ రాజు, మరొకరు సర్వేయర్ అఖిల్‌గా గుర్తించారు. సమాచారం అందడంతో ఎస్‌ఐ శ్రీహరిబాబు అక్కడకు వచ్చి ఇద్దరు దుండగులను అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. గాయపడిన షాపు యజమాని లక్ష్మణరావు, ఆయన భార్య రాజేశ్వరి, అతని బంధువు మంగరాజులను తుని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ ముగ్గురికి స్వల్ప గాయాలయ్యాయని, ప్రమాదమేమీ లేదని వైద్యులు తెలిపారని ఎస్‌ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని చెప్పారు.

అన్నదాతకు యంత్రలాభం


పాడి-పంట

- స్ట్రాబేలర్‌తో సులువుగా ఎండుగడ్డి సేకరణ
- క్రమంగా తీరుతున్న పశుగ్రాసం కొరత

అలమూరు: వ్యవసాయంలో వరి కోత యంత్రాల వాడడంతో పశుగ్రాసానికి ఉపయోగించే ఎండుగడ్డి నిరుపయోగంగా మారుతోంది. దీనివల్ల పాడిరైతులను ఎండి గడ్డి కొరత తీవ్రంగా వేధిస్తోంది. దీనిని నివారించేందుకు గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం విరివిగా స్ట్రా బేలర్ యంత్రాలను రాయితీపై అందించింది. అప్పటి వరకూ రైతులు ఇతర జిల్లాల నుంచి స్ట్రాబేలర్ యంత్రాలను తీసుకువచ్చి ఎండు గడ్డిని సేకరించేవారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రాయితీ ఇవ్వడంతో స్థానికంగా లభ్యమయ్యే స్ట్రాబేలర్ యంత్రాల సాయంతో ఎండుగడ్డిని సేకరిస్తున్నారు. ట్రాక్టర్‌కు దమ్ము చక్రాలు అమర్చినట్టుగానే స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించి గడ్డి సేకరణ జరుపుతుండటం వల్ల ఇటు రైతులకు, అటు కొనుగోలుదారులకు లాభదాయకంగా ఉంటోంది. గతంలో స్థానికంగా ఉండే పాడి రైతులు ఒకవేళ గడ్డిని సేకరిద్దామనుకున్నా వ్యయ ప్రయాసలు ఎక్కువగా ఉండటం వల్ల యంత్రంతో కోసిన వరి గడ్డిని పొలంలోనే వదిలేసి నిప్పు పెట్టేవారు. దీంతో ఎండుగడ్డి కొరత ఎక్కువై ఏటా ధర పెరుగుతూ వస్తోంది. మరి కొంతమంది రైతులు పెట్టుబడి ఎక్కువైనా కూలీలతో కోయించి వరిగడ్డిని భద్రపరచుకుంటున్నారు. ఇలాంటి తరుణంలో గోసంరక్షణ కేంద్రాలకు, డెయిరీఫాంలకు, పేపర్ మిల్లులకు ఎండుగడ్డి సేకరణ కష్టంగా మారింది. దీంతో


పెదపళ్లలో గడ్డిని సేకరిస్తున్న స్ట్రాబేలర్ యంత్రం


స్ట్రాబేలర్ సాయంతో సేకరించిన గడ్డి మోపులను తరలిస్తున్న దృశ్యం


వరి చేనులో స్ట్రాబేలర్ యంత్రం తయారు చేసిన గడ్డి మోపులు

వారంతా స్ట్రాబేలర్ యంత్రాలను తీసుకువచ్చి ట్రాక్టర్ సాయంతో పొలాల్లో వ్యర్థంగా పడి ఉన్న ఎండుగడ్డిని సేకరించి తీసుకువెళుతున్నారు. తమ పొలాల్లో లభ్యమయ్యే ఎండుగడ్డికి అధిక ధర లభ్యం కావడంతో అనేకమంది రైతులు సమీప పేపరుమిల్లులకు విక్రయాలు జరుపుతున్నారు. దీనివల్ల స్థానికంగా లభ్యమయ్యే ఎండుగడ్డికి విపరీతమైన డిమాండ్ ఏర్పడడంతో పాడి రైతులను తరచూ ఎండు గడ్డి కొరత వేధిస్తోంది. ఈ స్ట్రాబేలర్ యంత్రాల పనితీరును గుర్తించిన స్థానిక రైతులు రాయితీపై గతంలో మాదిరిగా ఇవ్వాలని వ్యవసాయశాఖకు విజ్ఞాపనలు చేస్తున్నారు.

అందుబాటులోకి రావాలని ఆకాంక్ష

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఈ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి 1.68 లక్షల ఎకరాల్లో వరిసాగు చేయగా అందులో 3.38 లక్షల టన్నుల ఎండు గడ్డి లభించవలసి ఉంది. అయితే 90 శాతం మేర వరికోత యంత్రాల సాయంతోనే రైతులు మాసూళ్లు చేయడంతో కేవలం 2.5 లక్షల టన్నుల ఎండుగడ్డి మాత్రమే లభిస్తుందని వ్యవసాయశాఖ అంచనా వేస్తోంది. గతంలో మాదిరిగా పొలాల్లోని గడ్డిని తగులబెట్టకుండా కొంతమంది రైతులు మాత్రం స్ట్రాబేలర్ యంత్రాన్ని వినియోగించుకుని గడ్డిని సేకరించుకుంటున్నారు. స్ట్రాబేలర్ యంత్రంతో సేకరిస్తే ఎకరాకు దాదాపు రెండు టన్నుల గడ్డి లభిస్తుంది. స్ట్రాబేలర్ యంత్రం 20 కేజీల చొప్పున మూట కట్టిన గడ్డిమోపులను పొలంలోనే పడవేస్తుంది. ఎకరాకు సుమారు 90 నుంచి 105 వరకూ గడ్డి మోపులు లభిస్తున్నాయి. తమ పొలాల్లో సేకరించే ఎండుగడ్డిని మోపుల రూపంలో గడ్డిమేట్లు వేసుకుని పశువుల దాణాగా అందించే పనిలో రైతులు నిమగ్నమయ్యారు. ఇతర పాడి రైతులు ఒక్కొక్క గడ్డిమోపునకు రూ.30 చొప్పున ధర రైతుకు చెల్లించి తీసుకువెళుతున్నారు. వరికోత యంత్రాల మాదిరి గానే స్ట్రాబేలర్ యంత్రాలు విరివిగా అందుబాటులోకి రావాలని పాడి రైతులు ఆకాంక్షిస్తున్నారు.

కాలుష్యాన్ని నివారించవచ్చు



వరి చేలల్లో పండించిన పంటను తీసుకుని అందులో వదిలేసిన గడ్డిని తగులబెట్టకుండా ఉంటే గ్రామీణ ప్రాంతాల్లో కాలుష్యాన్ని నివారించడంతో పాటు పశుగ్రాసం కొరత తీరుతుంది. గడ్డిని తగులబెట్టడం వల్ల కలిగే అగ్ని ప్రమాదాలను అరికట్టవచ్చు.

– కె.నాగేశ్వరరరావు, వ్యవసాయశాఖ ఏడీ, అలమూరు

ఎండు గడ్డి కొరత తీరనుంది



ట్రాక్టర్‌కు వెనుక భాగాన స్ట్రాబేలర్ యంత్రాన్ని అనుసంధానం చేసి గడ్డిని సేకరించడం వల్ల పశుగ్రాసం కొరత నుంచి ఉపశమనం కలుగుతుంది. ట్రాక్టర్ యజమానులకు ఈ యంత్రాన్ని రాయితీపై ఇస్తే ప్రయోజనకరంగా ఉంటుంది.

– ఆకుల రామకృష్ణ పాడి రైతు, మోదుకూరు

జెండా పాతిన బరితెగింపు

సామర్లకోట: మండల పరిధిలో వీకే రాయపురం గ్రామంలో సంక్రాంతి సందర్భంగా నిర్వహించే కోడి పందేలకు రంగం సిద్ధం అవుతోంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో టీడీపీ, జనసేన నాయకులు కలిసి కోడిపందేలు నిర్వహించాలని భావించారు. అయితే తెలుగుదేశం నాయకులు ప్రత్యేకంగా కోడిపందేలు నిర్వహించాలని నిర్ణయించుకున్నారు. దాంతో జనసేన గ్రామ నాయకుడు పెదిరెడ్ల కొండలరావు ఆధ్వర్యంలో కోడిపందేలకు బరి తయారు చేస్తున్నారు. జనసేన నాయకులకు పార్టీ అధ్యక్షుడు తుమ్మలబాబు అండ ఉండటంతో జనసేన నాయకులు ఉత్సాహంగా కోడి పందేల బరి తయారు చేయడంతో పాటు ఆ బరి వద్ద జనసేన జెండా ఏర్పాటు చేశారు. దాంతో తెలుగుదేశం, జనసేన నాయకుల్లో విభేదాలు పొడచూపుతున్నాయి.

ట్రాక్టరు సాయంతో తయారు చేసిన బరిలో పాతిన జనసేన జెండా →



రాష్ట్ర రగ్బీ జట్టుకు గురజనాపల్లి విద్యార్థులు

24 నుంచి పాట్నాలో ఆలిండియా స్కూల్‌గేమ్స్ పోటీలు

కరప: రాష్ట్ర రగ్బీ జట్టుకు కరప మండలం గురజనాపల్లి పబ్బినీడి పాపారావు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు నలుగురు ఎంపికైనట్టు హెచ్‌ఎం ఎ.సాయిమోహన్ శుక్రవారం తెలిపారు. గత నెల 24, 25 తేదీలలో కాకినాడలోని డీఎస్‌ఏ క్రీడామైదానంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ స్కూల్ గేమ్స్ అండర్–17 బాలికల విభాగంలో జరిగిన రగ్బీపోటీలలో పాఠశాల నుంచి ఎస్.వెంకటవినీల, ఎస్.చాందినిశ్రీ, ఎం.సాయిమౌనిక, పి.దివ్య, పి.మహాలక్ష్మి ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా జట్టు తరపున పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరచడంతో జిల్లా జట్టును ప్రథమ స్థానంలో నిలిపారు. ప్రతిభ కనబరచిన సుందర వెంకట వినీలను రాష్ట జట్టుకు ఎంపిక చేశారు. ఫస్ట్ స్టాండ్‌బైగా చాందినిశ్రీని ఎంపిక చేశారన్నారు. అండర్–19 బాలురు, బాలికల విభాగంలో కర్నూలులో జరిగిన రగ్బీపోటీలలో ప్రతిభ కనబరచిన గురజనాపల్లి విద్యార్థులు దడాల బేబీ, నిమ్మకాయల వెంకటేష్ రాష్ట రగ్బీజట్టుకు ఎంపికయ్యారు. బిహార్ రాష్ట్రం పాట్నాలో ఈ నెల 24 నుంచి 30వ తేదీవరకు జరగనున్న ఆలిండియా స్కూల్‌గేమ్స్ రగ్బీ పోటీలలో ఆంధ్రప్రదేశ్ రాష్ట జట్టు తరపున పాల్గొంటారని పీడీ ఎస్.నాగమల్లేశ్వరరావు తెలిపారు.


ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, పీడీ, ఉపాధ్యాయులు



కట్న కానుకలకు మంగళం!

- సత్యదేవుని నిత్య కల్యాణంలో ఆగిపోయిన ఆచారం
- పునరుద్ధరిస్తే మేలంటున్న భక్తులు

అన్నవరం: సత్యదేవుని నిత్యకల్యాణంలో పాల్గొన్న భక్తులు స్వామి, అమ్మవారికి కట్న కానుకలు సమర్పించే సంప్రదాయానికి పురోహితులు, అర్చకులు, సిబ్బంది మంగళం పలికారు. రత్నగిరిపై ప్రతీరోజు స్వామి, అమ్మవారికి కల్యాణం నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఈ కల్యాణంలో పాల్గొనే భక్తులు స్వామి, అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించడం, కల్యాణం అనంతరం స్వామి, అమ్మవారికి కట్న కానుకలు సమర్పించే ఆచారం పూర్వం నుంచీ ఉంది. కొన్నేళ్లుగా ఈ ఆచారం పాటించకపోవడంతో 2023 సంవత్సరంలో అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ ఆగస్టు 13వ తేదీ నుంచి భక్తులు కట్నకానుకలు సమర్పించే విధానాన్ని పునరుద్ధరించారు. దీంతో కల్యాణం చేయించే భక్తులునుద్దేశించి అర్చకస్వాములు, పురోహితులు స్వామి, అమ్మవార్లకు నూతన వస్త్రాలు సమర్పించవచ్చునని, కట్నకానుకలు చదివించాలని ప్రకటించడంతో ప్రతి రోజూ భక్తులు కట్నకానుకలు చదివించేవారు. నూతన పట్టు వస్త్రాలు దేవస్థానం వద్ద కొని వాటిని స్వామి, అమ్మవార్లకు సమర్పించేవారు. గతేడాది ఆగస్టు నుంచి ప్రతి నెలా సుమారు రూ.లక్ష కట్నకానుకల రూపంలో, రోజూ పదుల సంఖ్యలో నూతన వస్త్రాలు స్వామికి వచ్చాయి. రూ.500, అంతకన్నా ఎక్కువ మొత్తాలను రికార్డులో రాసి వారి గోత్రనామాలను పండితులు చదివి ఆశీర్వదించేవారు. అంతకు తక్కువ అయితే ఆ మొత్తాన్ని హుండీలో వేసేవారు. ఈ విధంగా 2023 సంవత్సరంలో దేవస్థానానికి సుమారు రూ.ఐదు లక్షల ఆదాయం సమకూరింది. ఆ తరువాత కట్న కానుకల చదివింపు కార్యక్రమాన్ని నిలుపుదల చేసి కేవలం పట్టు వస్త్రాల సమర్పణ మాత్రమే కొనసాగిస్తున్నారు. దీనిపై నిత్యకల్యాణం సిబ్బందిని ప్రశ్నిస్తే కట్న కానుకలు ఆపేశామని తెలిపారు. అధికారులు ఈ కట్న కానుకల చదివింపును పునరుద్ధరిస్తే దేవస్థానానికి ఆదాయంతో బాటు భక్తులు సంతృప్తి చెందుతారనే అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.


స్వామివారి నిత్య కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభం


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నానాజీ


పురుషుల విభాగంలో పోటీ పడుతున్న క్రీడాకారులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): క్రీడాస్ఫూర్తితో పోటీల్లో రాణించాలని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరావు (నానాజీ) పేర్కొన్నారు. శుక్రవారం కాకినాడ సురేష్ నగరంలోని శ్రీప్రకాష్ స్కూల్‌లో రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు ప్రారంభమయ్యాయి. పోటీల ప్రారంభ కార్యక్రమానికి రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘ అధ్యక్షుడు భాస్కర్‌రాం అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడారు. టేబుల్ టెన్నిస్ జాతీయస్థాయి ఆటగాడు, కోచ్ భీష్మ పితామహా బిరుదు గ్రహీత ముక్కామల ఫొటోకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ పోటీలకు 12 జిల్లాల నుంచి 230 మంది హాజరయ్యారు. అనంతరం అతిథిలు పోటీలను లాంఛనంగా ప్రారంభించారు. ఏపీ టేబుల్ టెన్నిస్ సంఘ గౌరవ అధ్యక్షుడు రావు చిన్నారావు, కార్యదర్శి విశ్వనాథ, శ్రీప్రకాష్ విద్యా సంస్థల డైరెక్టర్ విజయప్రకాష్, బీవీ కృష్ణారావు, సీపోర్ట్సు సీఈఓ మురళీధర్, జిల్లా టేబుల్‌టెన్నిస్ సంఘ కార్యదర్శి మోహన్‌బాబు పాల్గొన్నారు.

వృద్ధురాలి సజీవ దహనం?



సామర్లకోట: స్థానిక 27వ వార్డులో శుక్రవారం ఒక వృద్ధురాలు విక్రం అచ్చియ్యమ్మ (90) సజీవ దహనం అయినట్టు తెలిసింది. వృద్ధురాలి ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. మధ్యాహ్నం భోజనం చేశాక చుట్ట కాలుస్తూ మంచంపై నిద్రించడంతో సజీవ దహనం అయినట్టు కొందరు చెబుతున్నారు. టీ కాస్తుండగా అదుపు తప్పి పొయ్యిలో పడిపోవడంతో సజీవ దహనం అయిందని మరికొందరు అంటున్నారు. ఇంటిలో నుంచి పొగ రావడంతో స్థానికులు వెళ్లి చూడగా మంచం కింద వృద్ధురాలి మృతదేహం ఉన్నట్టు గుర్తించారు. విషయం తెలిసిన ఆమె బంధువులు వచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. దీనిపై కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

← మంచం కింద అచ్చియ్యమ్మ మృతదేహం

నన్నయలో చైల్డ్ సైకాలజీ కోర్సు

ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య శ్రీనివాసరావు

రాజానగరం: ఆదికవి నన్నయ యూనివర్సిటీలో డిపార్టుమెంట్ ఆఫ్ సైకాలజీ ఆధ్వర్యంలో చైల్డ్ అండ్ అడాలసెంట్ గైడెన్స్ అండ్ కౌన్సెలింగ్ పీజీ డిప్లమా కోర్సును ఆసక్తి ఉన్నవారంతా సద్వినియోగం చేసుకోవాలని ఇన్‌చార్జ్ వీసీ ఆచార్య వై. శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు. ఈ కోర్సుకు సంబంధించిన బ్రోచర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఇంతవరకు రెండు బ్యాచ్‌లు పూర్తయ్యాయని, ప్రస్తుతం మూడో బ్యాచ్ కోసం అడ్మిషన్లు ప్రారంభమయ్యాయన్నారు. ఏడాది కాలపరిమితితో కూడిన ఈ కోర్సులో 40 సీట్లు ఉన్నాయని, అనుభవజ్ఞులైన అధ్యాపకులతో బోధన జరుగుతుందన్నారు. రాష్ట్రంలో ఏ ఇతర యూనివర్సిటీలోనూ ఈ కోర్సు లేదన్నారు. ఈ కారణంగా మంచి డిమాండ్‌తో నడుస్తున్న ఈ కోర్సులో చేరేందుకు ఆసక్తి ఉన్నవారు వచ్చే నెలలోగా దరఖాస్తు చేసుకుని, 22న జరిగే కౌన్సెలింగ్‌కి హాజరుకావొచ్చన్నారు. ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన అభ్యర్థులు ఈ కోర్సులో చేరేందుకు అర్హులన్నారు. ఇతర వివరాలకు యూనివర్సిటీ వెబ్‌సైట్‌ని సందర్శించవచ్చని, లేకుంటే 92462 87989కి ఫోన్ చేయవచ్చునని సూచించారు. రిజిస్ట్రార్ ఆచార్య జి. సుధాకర్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ పి.విజయనిర్మల, డీన్ ఆచార్య కేవీ స్వామి, కోఆర్డినేటర్ డాక్టర్ నక్కిన నారాయణ, డాక్టర్ పడాల రాజశేఖర్, డాక్టర్ సీహెచ్ భవానీ పాల్గొన్నారు.


బ్రోచర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

విశాఖకు ఓవరాల్ చాంపియన్ షిప్

ముగిసిన రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీలు

పిఠాపురం: రాష్ట స్థాయి బాక్సింగ్ పోటీల్లో ఓవరాల్ చాంపియన్ షిప్ విశాఖపట్నం జిల్లా సాధించింది. ఈ నెల 19, 20 తేదీల్లో పిఠాపురంలో జరిగిన రాష్ట స్థాయి బాక్సింగ్ మెన్ బాక్సింగ్ పోటీలో విశాఖపట్నం మొదటి స్థానంలో, శ్రీకాకుళం జిల్లా రెండో స్థానంలో నిలిచాయి. ఈ పోటీల్లో 10 మంది బాక్సర్లు స్వర్ణ పతకాలు సాధించారు. ఈ బాక్సర్స్ జనవరి 6 నుంచి 14వ తేదీ వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో జరగనున్న జాతీయస్థాయి మెన్ బాక్సింగ్ పోటీలకు ఆంధ్రప్రదేశ్ నుంచి పాల్గొంటారని ఆర్గనైజింగ్ సెక్రటరీ పి.లక్ష్మణరావు తెలిపారు. పిఠాపురం నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే ఎస్‌వీఎస్‌ఎన్ వర్మ జిల్లా స్పోర్ట్సు డెవలప్‌మెంట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ కుమార్, ద్రోణాచార్య అవార్డు గ్రహీత డాక్టర్ ఐ వెంకటేశ్వరరావు, ఏపీ బాక్సింగ్ అసోసియేషన్ సెక్రటరీ బీఏ లక్ష్మణ్ దేవ్ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కౌన్సిలర్ రాయుడు శ్రీనివాసరావు, అలవరపు నగేష్, కేతవరపుకృష్ణ, ఆర్ఆర్బీ హెచ్ఆర్ హైస్కూల్ వైస్ చైర్మన్ సూర్యవతి పాల్గొన్నారు.


బహుమతులు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే వర్మ తదితరులు

పురుగు మందు తాగిన విద్యార్థిని మృతి


నైపుణ్య (ఫైల్)

కొత్తపల్లి: తల్లి మందలించిందని కోపంతో పురుగుల మందు తాగి అస్వస్థతకు గురై చికిత్స పొందుతున్న విద్యార్థి మృతి చెందినట్లు శుక్రవారం పోలీసులు తెలిపారు. మండలంలోని రమణక్కపేట గ్రామానికి చెందిన చింతపల్లి నైపుణ్య(16) స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో 10వ తరగతి చదువుతోంది. ఇటీవల పాఠశాలలో నిర్వహించిన పరీక్షల్లో మార్కులు తక్కువగా వస్తున్నాయని ఉపాధ్యాయులు బాలిక తల్లి సుభాషిణికి సమాచారం ఇచ్చారు. దీంతో ప్రతీ రోజు పాఠశాలకు వెళుతున్నావు, బాగా చదువుకోవాలని తల్లి గట్టిగా మందలించడాన్ని తట్టుకోలేని విద్యార్థి గురువారం ఉదయం కూరగాయలకు కొట్టే పురుగుల మందును తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. చికిత్స నిమిత్తం అంబులెన్స్‌లో కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందింది. దీనిపై ఎస్సై వెంకటేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ప్రశాంతంగా సెల్ఫ్ అసెస్మెంట్ పరీక్షలు


స్టాక్ పాయింట్ల నుంచి ప్రశ్నాపత్రాలను అందజేస్తున్న డీఐ దిలీప్‌కుమార్

కంబాలచెరువు: (రాజమహేంద్రవరం) వారం రోజులుగా జరుగుతున్న సెల్ఫ్ అసెస్మెంట్ టర్మ్ -1 పరీక్షలు గురువారంతో పూర్తయినట్టు అర్బన్ రేంజ్ డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ స్కూల్స్ బి.దిలీప్ కుమార్ తెలిపారు. ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాల స్టాక్ పాయింట్ వద్ద పూర్తి బందోబస్తు మధ్య ప్రశ్నపత్రాలను ఉంచి, పరీక్ష సమయానికి గంట ముందు పాఠశాలలకు పంపించినట్టు తెలిపారు. అర్బన్ మండలంలో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయన్నారు. సీఆర్‌ఎంటీలు జయంతి శాస్త్రి, జె.శ్రీనివాసరావు, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

అంబాజీపేట కొబ్బరి మార్కెట్

కొబ్బరి రకం	ధర (రూ.ల్లో)
కొత్తకొబ్బరి (క్వింటాల్)	12,000 – 12,500
కొత్తకొబ్బరి (రెండవ రకం)	9,500 – 10,000
కురిడీ కొబ్బరి (పాతవి)	
గండేరా (వెయ్యి)	17,500
గటగట (వెయ్యి)	16,000
కురిడీ కొబ్బరి (కొత్తవి)	
గండేరా (వెయ్యి)	16,500
గటగట (వెయ్యి)	15,000
నీటికాయ,పాత (ముక్కుడు)కాయ (వెయ్యి)	13,000 – 14,000
కొత్త (పచ్చి)కాయ (వెయ్యి)	10,000 – 11,000
కొబ్బరి నూనె (15 కిలోలు)	3,750
ఒక కిలో	260

దింపు కార్మికుడి మృతి


కముజు వెంకటరావు (ఫైల్)

ముమ్మిడివరం: మండలంలోని చినకొత్తలంకకు చెందిన దింపు కార్మికుడు కొబ్బరి చెట్టు పైనుంచి జారి పడి మృతిచెందాడు. గ్రామానికి చెందిన కముజు వెంకటరావు(59) గురువారం అదే గ్రామానికి చెందిన ఓ రైతు పొలంలో దింపు తీస్తుండగా ప్రమాదవశాత్తూ చెట్టుపై నుంచి జారి పడిపోవడంతో తలకు, వెన్నుపూసకు బలమైన గాయాలయ్యాయి. గాయపడిన వెంకటరావును 108 అంబులెన్స్‌లో అమలాపురం ప్రయివేటు ఆసుపత్రికి తరలించారు. తర్వాత మెరుగైన వైద్యం కోసం కాకినాడ జీజీహెచ్‌కు తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు శుక్రవారం తెలిపారు. మృతునికి భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు.